

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in
27-6-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2


## ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ బడి



2

## చెట్టును ఢీకొన్న కారు ఇద్దరు మృతి



2


## పోలియో రహిత సమాజం మనందరి లక్ష్యం..



**అక్షరటుడే, ఇందూరు:** పోలియో రహిత సమాజం మనందరి లక్ష్యమని అడిషనల్ కలెక్టర్ భుజంగరావు అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమం సందర్భంగా నగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఐదేళ్లలోపు చిన్నారులందరికి జూన్ 28 ఆదివారం పల్స్ పోలియో చుక్కల మందును అందించాలన్నారు. ఈ సందర్భంగా పోలియోపై అవగాహన కలిగించే పోస్టర్లను అడిషనల్ కలెక్టర్ ఆవిష్కరించారు.

## రికార్డ్ అసిస్టెంట్‌పై కలెక్టర్ సస్పెన్షన్ వేటు



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** రికార్డులు తారుమారు చేసిన రెవెన్యూ అధికారిపై వేటు పడింది. ఈ మేరకు కలెక్టర్ ఇలా త్రిపాఠి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. నిజామాబాద్ నార్త్ తహశీల్దార్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న జె రాహుల్‌పై సస్పెన్షన్ వేటు వేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. రెవెన్యూ రికార్డుల (పహాణీల)లో అక్రమ మార్పులు చేయడం, రికార్డుల తారుమారు, విధి నిర్వహణలో అవకతవకలకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో జిల్లా పాలనాధికారి కఠిన చర్యలకు ఉపక్రమించారు. సదరు ఉద్యోగిని సస్పెండ్ చేయడంతో పాటు, శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. నిజామాబాద్ నార్త్ మండలం పరిధిలోని కంఠేశ్వర్ ప్రాంతంలో సర్వే నంబర్లు 291/ఏ, 291ఏఏ, 292లకు సంబంధించిన రెవెన్యూ రికార్డుల్లో టాంపరింగ్ జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పందించి ప్రాథమిక విచారణ జరిపించారు. రెవెన్యూ రికార్డుల టాంపరింగ్ వాస్తవమేనని విచారణలో వెల్లడైంది. దీంతో విచారణ నివేదిక ఆధారంగా, ఆరోపణలు ఎదుర్కొంటున్న రికార్డు అసిస్టెంట్ రాహుల్‌ను సస్పెండ్ చేస్తూ శాఖాపరంగా సమగ్ర విచారణ చేపట్టాలని కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. శాఖాపరమైన విచారణ అనంతరం సమగ్ర నివేదికను అనుసరిస్తూ తదుపరి చర్యలు ఉంటాయని కలెక్టర్ వెల్లడించారు. రెవెన్యూ రికార్డుల్లో అక్రమాలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.



## బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థినికి కలెక్టర్ చేయూత

**అక్షరటుడే, కామారెడ్డి:** ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకి కాకూడదనే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం సహకరిస్తోందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. ఆర్జీయూకేటీ బాసర్ క్యాంపస్‌లో చదువుతున్న కామారెడ్డి జిల్లా విద్యార్థిని నిఖిత ఆర్థిక సహాయం కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసింది. కుటుంబ పరిస్థితులను పరిశీలించిన కలెక్టర్ వెంటనే స్పందించి, ఆదివారం తన కార్యాలయంలో రూ.10 వేల విలువైన చెక్కును రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా అందజేశారు. పుస్తకాలు, అధ్యయన సామగ్రి, ప్రయాణ ఖర్చులకు ఈ మొత్తం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఆర్థిక కారణాలతో చదువు ఆపకుండా పట్టుదలతో ముందుకెళ్లి ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు కలెక్టర్ సూచించారు. సహాయం అందినందుకు నిఖిత కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపింది. కార్యక్రమంలో ఎస్పీ రాజేష్ చంద్ర, రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షులు రాజన్న, నరసింహులు, విద్యార్థిని తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ట్రాఫిక్ చలాన్లు తప్పించుకోవడానికి పలువురు నకిలీ నంబర్ ప్లేట్లను వినియోగిస్తున్నారు. మరికొందరు అసలు నంబర్ ప్లేట్ లేకుండానే రోడ్లపై దూసుకు వెళ్తున్నారు. ఇంకొంత మంది వాహనాల నంబర్ కనిపించకుండా చెరిపేస్తున్నారు. ఇలా పోలీసులను బురిడీ కొట్టిస్తున్న పట్టించుకునే వారే కరువయ్యారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. - అక్షరటుడే, కామారెడ్డి

# ఫేక్ నంబర్ ప్లేట్లతో రయ్ రయ్

- పోలీసులను బురిడీ కొట్టిస్తున్న పలువురు
- నంబర్లు చెరిపేసి తిరుగుతున్న మరికొందరు
- హెల్మెట్ జరిమానాలు, రికవరీలపైనే పోలీసుల దృష్టి

కామారెడ్డి జిల్లాలో పోలీసులు ట్రాఫిక్ నిబంధనల విషయంలో పక్కాగా వ్యవహరిస్తున్నారు. ఎస్పీ రాజేశ్ చంద్ర ఆదేశాల మేరకు నిత్యం తనిఖీలు చేస్తున్నారు. ఎవరైనా తప్పు చేసి దొరికితే జరిమానాలు వేస్తున్నారు. డ్రంకన్ డ్రైవ్ కేసులను కోర్టుల్లో ప్రవేశ పెడుతున్నారు. అయితే నంబర్ ప్లేట్ లేని వాహనాలు, నంబర్ చెరిపేసిన వాహనాలను కట్టడి చేయడంలో పోలీసులు విఫలం అవుతున్నారన్న టాక్ వినిపిస్తోంది. రోడ్లపై బహిరంగానే వాహనాలు తిరుగుతున్నా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### వందలాది వాహనాలు

కామారెడ్డి పట్టణంతో పాటు జిల్లా వ్యాప్తంగా నంబర్ ప్లేట్ లేకుండా, లేదా అస్పష్టంగా ఉన్న నంబర్లతో వందలాది బైకులు, కార్లు తిరుగుతున్నాయి. కొన్ని వాహనాలకు ముందు నంబర్ ప్లేట్ ఉండదు. మరికొన్నింటికి వెనుక నంబర్ మసకబారిపోయి ఉంటుంది. బురదతో, ఇనుప పట్టీలతో నంబర్లను ఉద్దేశపూర్వకంగా కప్పేస్తు న్న ఘటనలు కూడా సర్వసాధారణమయ్యాయి. ఇలాంటి వాహనాలే చైన్ స్నాచింగ్, ర్యాష్ డ్రైవింగ్ వంటి ఘటనలకు ఉపయోగపడు తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి.

### వాటిపైనే దృష్టి

ట్రాఫిక్ పోలీసులు ప్రస్తుతం హెల్మెట్ లేకపోవడం, సిగ్నల్ జంప్ చేయడం వంటి అంశాలపై మాత్రమే ఫోకస్ చేస్తున్నారని ప్రజలు పేర్కొంటున్నారు. నెలవారీ రికవరీ లక్ష్యాలను చేరుకోవడానికి సులభంగా దొరికే ఉల్లంఘనలకే ప్రాధాన్యం ఇస్తున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. జరిమానాలు పడిన వారి నుంచి ముక్కుపిండి రికవరీ చేస్తున్న పోలీసులు, నిబంధనలకు తూట్లు పొడిచి తిరుగుతున్న వారిపై చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### ఒకరి బైక్.. మరొకరికి ఫైన్లు

కొందరు నకిలీ నంబర్ ప్లేట్లను వినియోగిస్తున్నారు. ఇతరుల వాహనాల నంబర్‌ను తమ బైక్‌లకు పెట్టుకుం టున్నారు. దీంతో వారు చేసిన తప్పులకు అసలు బైక్ యజమానికి జరిమానా పడుతోంది. తాము ఏ తప్పు చేయకున్నా.. ఫైన్ పడ్డట్లు మెసేజ్‌లు వస్తున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ వాహనం ఇంట్లో ఉంచినా, మరోలాంటి బైక్ నంబర్‌తో తప్పు చేసినా ఫైన్ మెసేజ్ అసలు యజమాని ఫోన్‌కు వస్తోంది. ఫిర్యాదు చేయడానికి తిరిగేందుకు సమయం లేక సామాన్యులు మౌనంగా జరిమానా కడుతున్నారు.

### చర్యలు శూన్యం

మోటారు వాహన చట్టం ప్రకారం నంబర్ ప్లేట్ లేకుండా వాహనం నడపడం నేరం. దీనికి భారీ జరిమానా విధించాలి. కానీ వాస్తవంలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. నంబర్ చెరిపేసి తిరుగుతున్న వాహనాలను పోలీసులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. చెక్‌పోస్టుల వద్ద, రోడ్లపై విధులు నిర్వహించే సిబ్బంది ఈ వాహనాలను సులభంగా గుర్తించినా చర్యలు తీసుకోకపోవడంతో నిబంధనలు ఉల్లంఘించే వారి సంఖ్య పెరుగుతోంది.



ఒకవైపు నిజమైన నేరగాళ్లు తప్పించుకుంటుంటే, మరోవైపు అమాయకులు నష్టపోతున్నారు. ఈ ఘటనలు తరచుగా బయటపడుతూనే ఉన్నా వాటిని సరిచేయడంపై దృష్టి సారించడం లేదని వాహనదారులు వాపోతున్నారు.

### నా బైక్ కాకున్నా ఫైన్ వేశారు



నేను భవానిపేట సబ్ స్టేషన్‌లో ఆపరేటర్‌గా పని చేస్తాను. రెండు రోజులు విధులు ముగించుకుని శుక్రవారం ఇంటికి వచ్చాను. కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని దేవునిపల్లి గ్రామంలో ఉంటాను. అయితే నా బైక్‌కు మద్నూర్ చిన్న శక్కర్గ హైవేపై హెల్మెట్ లేదని ఫైన్ వేశారు. ఇది అన్యాయం. విధులు ముగించుకుని ఇంటిదగ్గర బైక్ పార్క్ చేస్తే ఎక్కడో హెల్మెట్ లేదని ఫైన్ వేయడం ఎంతవరకు సమంజసం. **– రాజు, విద్యుత్ శాఖ ఉద్యోగి**

### స్పెషల్ డ్రైవ్ చేపడతాం



నంబర్ ప్లేట్ లేకుండా, నంబర్ చెరిపేసి వాహనాలు తిరగడం చట్టరీత్య నేరం. అలాంటి వాహనాలపై చర్యలు తీసుకుంటాం. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లి నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న వాహనాలపై స్పెషల్ డ్రైవ్ చేపడతాం. ఒకరి బైక్ ఫైన్ మరొకరికి పడితే ఫిర్యాదు చేస్తే సరిచేస్తాం.. **– మధుసూదన్, డీఎస్పీ**



## ప్రీ ప్రైమరీ తరగతుల పరిశీలన

**అక్షటుడే, పెద్దకొడప్‌గల్ :** మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం మండల విద్యాధికారి ప్రవీణ్ కుమార్ ప్రీ ప్రైమరీ తరగతి గదిని, విద్యార్థులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలల్లో నర్సరీ ఎల్‌కేజీ, యూకేజీ చదువులు పేదలకు భారం కావొద్దనే ఉద్దేశంతోనే ప్రభుత్వం కొత్తగా ఆలోచన చేసిందన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతులను ప్రారంభించడం జరిగిందన్నారు. మండలంలోని పెద్దకొడప్‌గల్, కాస్లాబాద్ గ్రామాల్లో ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభమయ్యాయన్నారు. చిన్నపిల్లలకు ఆట వస్తువులు, బొమ్మలు, అలాగే వారికి నిద్రవస్తే పడుకునే విధంగా సదుపాయాలు కల్పించామన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీ రాములు, గోపాల్ సింగ్, ప్రైమరీ టీచర్ రాధ పాల్గొన్నారు.



## మహాత్మా.. మన్నించు..

జాతిపిత విగ్రహం పూర్తిగా శిథిలమైపోయినా పట్టించుకునే నాథుడే లేకుండా పోయారు. జక్రాన్‌పల్లి మండలం బ్రాహ్మణపల్లి పంచాయతీ పరిధిలోని గాంధీనగర్ కాలనీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో మహాత్మ గాంధీ విగ్రహం పూర్తిగా రంగువెలిసిపోయి ఆకారం మారిపోయింది. విగ్రహం కాళ్లు, చేతులు, తలభాగాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అయినప్పటికీ జీపీ కాని.. ఇతర అధికారులు గాని పట్టించుకున్న దాఖలాలు లేవని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతులు చేయించాలని లేదా నూతన విగ్రహం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. **– వింజామర శరత్‌కుమార్, అక్షరటుడే, ఆర్మూర్ ప్రతినిధి**




## విద్యార్థులు తమ విద్యను సమాజ సేవకు వినియోగించుకోవాలి

**అక్షరటుడే, బాన్సువాడ :** విద్యార్థులు తమ విద్యను సమాజ సేవకు వినియోగించుకోవాలని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి సూచించారు. బాన్సువాడ పట్టణంలోని భారత్ గార్డెన్స్‌లో బీఎస్సీ నర్సింగ్ కళాశాల విద్యార్థినుల తొలి గ్రాడ్యుయేషన్ డే, వీడ్కోలు సభ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజుతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఎస్సీ నర్సింగ్ కోర్సు విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రణతి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సౌకర్యాలు అందేలా పర్యవేక్షించాలి



**అక్షరటుడే, కామారెడ్డి:** విద్యార్థులకు సరైన సౌకర్యాలు అందించేలా అధికారులు పర్యవేక్షించాలని జిల్లా ప్రత్యేక అధికారిణి బి.విజయేంద్ర ఆదేశించారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తో కలిసి శనివారం దోమకొండ సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలను తనిఖీ చేశారు.

### విద్యార్థులతో కలిసి భోజనం..

విద్యార్థినులతో కలిసి ప్రత్యేక అధికారిణి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం అధికారులు, విద్య, వసతి, ఆహారం, ఇతర సౌకర్యాలపై సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు క్రమం తప్పకుండా హెల్త్ చెకప్‌లు నిర్వహించాలని, వర్షాకాలంలో దోమల బెడద దృష్ట్యా అందరూ దోమతెరలు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. యూనిఫాం క్లాత్ అందిన వెంటనే కొలతలు తీసి కుట్టించి అందించాలని ఆదేశించారు. జిల్లాలో బాల్య వివాహాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని, అలాంటి ఘటనలు గమనించిన వెంటనే సమాచారం ఇవ్వాలని తెలిపారు. పౌష్టికాహారం తీసుకోవాలని, ఆహారాన్ని వృథా చేయవద్దని విద్యార్థినులకు సూచించారు. ఉపాధ్యాయులు, వార్డెన్లు ప్రతి విద్యార్థి సరైన పౌష్టికాహారం తీసుకునేలా చూడాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, పరిశుభ్రమైన వసతి, మెరుగైన విద్యా వాతావరణం అందేలా నిరంతరం పర్యవేక్షించాలన్నారు.

## రహదారిపై గుంతల్లో నాట్లు వేసి నిరసన

**అక్షరటుడే, బోధన్ :** పట్టణంలోని 11వ వార్డులో బీజేపీ నాయకులు వినూత్నంగా నిరసన తెలిపారు. రాకాసిపేట్ అయ్యప్ప గుడి కమాన్ ఆటో స్టాండ్ మధ్యలో రహదారిపై వార్డు కౌన్సిలర్ కొల్లిపాక రేణుక బాలరాజ్ ఆధ్వర్యంలో వరినాట్లు వేశారు. ఈ రహదారి పూర్తిగా గుంతలమయం కావడంతో కనీసం నడిచేందుకు కూడా అవకాశం లేకుండా పోయిందని బీజేపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కౌన్సిలర్ కొల్లిపాక రేణుక బాలరాజ్ మాట్లాడుతూ.. ఈ దారిలో నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయన్నారు. భారీ గుంతల కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ బోధన్ పట్టణ అధ్యక్షుడు పసులోటి గోపికిషన్, సీనియర్ నాయకులు గొడుగు ధర్మపురి, గుంత గంగాధర్, రాజులదేవి పవన్ కుమార్, మాసిని వినోద్, హన్మాండ్లు చారి, పట్టణ ప్రధాన కార్యదర్శి మీర్జాపూర్ అరవింద్, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు ఏనుగంటి గౌతమ్ గౌడ్, పార్టీ నాయకులు పప్పుల వేణు, కన్నె శ్రీనివాస్, దుర్గా ప్రసాద్, గడ్డం శ్రీనివాస్, ఫణీంద్ర, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రైవేట్ పాఠశాలల తనిఖీ



**అక్షటుడే,పెద్దకొడప్‌గల్:** మండల కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలలను శనివారం ఎంఈవో ప్రవీణ్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రైవేట్ పాఠశాలలో అన్ని హంగులతో కూడిన సదుపాయాలు ఉండాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనా పరమైన అర్హతలు ఉండాలని యాజమాన్యానికి సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో నియమనిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సీఆర్‌సీ రాములు, గోపాల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## ‘సర్’ సర్వేలో ప్రతిఒక్కరూ పాల్గొనాలి..




**అక్షరటుడే, ఇందూరు:** ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పటిష్టవంతంగా అమలు చేసేందుకు ‘సర్’ సర్వేలో ప్రతి ఓటరు పాల్గొనాలని బీజేపీ మాజీ శాసనసభాపక్ష నేత యెండల లక్ష్మీనారాయణ అన్నారు. సర్వేలో భాగంగా నగరంలోని శ్రీనగర్‌లో ఉన్న ఆయన స్వగృహానికి వచ్చిన బీఎల్‌వోలకు సమాచారం అందించారు. బృందానికి ఓటరు వివరాలు అందజేశారు. బీఎల్‌వోలు ఇచ్చిన ఎస్ఐఆర్ పత్రాన్ని వివరాలతో నింపి అందజేశారు. ఈ సందర్భంగా యెండల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతి గొప్ప ప్రజాస్వామ్య దేశం అయిన భారత్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా సర్వే జరుగుతోందన్నారు. కొత్తగా ఓటరు నమోదు చేసుకునే యువత కూడా పెద్ద సంఖ్యలో ఈ సర్వేలో పాల్గొనాలన్నారు. నకిలీ ఓట్లను గుర్తించి ప్రతినిధులకు తెలియజేయాలని తద్వారా పారదర్శకమైన ఎన్నికల ప్రక్రియ జరుగుతుందన్నారు.



## ముమ్మరంగా ‘ఎస్ఐఆర్’ పత్రాల పంపిణీ

**అక్షరటుడే, భీమ్‌గల్:** మండల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ పత్రాల పంపిణీ కార్యక్రమం చురుగ్గా సాగింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ సర్వే ప్రక్రియలో భాగంగా మండలంలోని చేంగల్, ముచ్కూర్, బెజ్జోర, పిప్రి, పెద్దమ్మకాడి తండా, గోనుగోపుల తదితర గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లెల లక్ష్మణ్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు అరిగెల జనార్ధన్ విస్తృతంగా పర్యటించారు. గ్రామాల్లో ఎన్యుమరేటర్లు ఇంటింటికీ తిరుగుతూ చేస్తున్న పత్రాల పంపిణీని వారు స్వయంగా పరిశీలించారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక సర్వేలలో ఈ ఎన్యుమరేషన్ ప్రక్రియ అత్యంత కీలకమైనదని పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికీ ఈ పత్రాలు అందేలా చూడాలని, సర్వేలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా వివరాలు నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు కాంగ్రెస్ కార్యకర్తలు బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

## చెట్టును ఢీకొన్న కారు.. ఇద్దరు మృతి



**అక్షరటుడే, కామారెడ్డి:** మాచారెడ్డి మండలం కాకులగుట్ట తండా శివారులో శుక్రవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కామారెడ్డి నుంచి గంభీరావుపేటకు వెళ్తున్న కారు ఓ చెట్టును ఢీకొంది. ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురిలో అనిల్ అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా తీవ్రంగా గాయపడిన ఇద్దరిని హైదరాబాద్‌కు తరలించారు. హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న ఇద్దరిలో అన్వేష్ గౌడ్ (25) చికిత్స పొందుతూ తెల్లవారుజామున మృతి చెందాడు. కాగా.. మృతి చెందిన అన్వేష్ గౌడ్ గంభీరావుపేటలో ఓ బ్యాంకులో ప్రైవేట్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. ప్రమాదంలో గాయపడిన మరొక యువకుడు వికాస్ పరిస్థితి మెరుగ్గా ఉందని పోలీసులు తెలిపారు.

## రేపు జిల్లా బీజేపీ కార్యాలయం ప్రారంభం

**అక్షరటుడే, కామారెడ్డి:** పట్టణంలో బీజేపీ కార్యాలయం ఆదివారం ప్రారంభోత్సవానికి ముస్తాబైంది. రేపు ఉదయం 11 గంటలకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ వర్చువల్‌గా ప్రారంభించనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు తెలిపారు. కాగా.. గతంలో బీజేపీ కార్యాలయం అద్దె భవనాల్లో కొనసాగేది. జాతీయ రహదారికి ఆనుకుని రామేశ్వర్ పల్లి శివారులో పార్టీ కార్యాలయం కోసం స్థలం కొనుగోలు చేశారు. ఏడాది క్రితం పార్టీ భవన నిర్మాణం పూర్తయింది. ప్రారంభోత్సవం సందర్భంగా కార్యకర్తలందరూ హాజరుకావాలని జిల్లా అధ్యక్షుడు కోరారు.



“ఈ రోజుల్లో పిల్లవాడికి ఎల్‌కేజీ సీటు కావాలన్నా రూ.వేలల్లో కుమ్మరించాల్సిందే. పుస్తకాలు, యూనిఫామ్స్, వ్యాన్ ఫీజులంటూ ప్రైవేట్ పాఠశాలలు సాగించే దోపిడీ అంతా ఇంతా కాదు. కానీ.. తాడ్వాయి మండలం కన్కల్ గ్రామం ఈ ట్రెండ్‌కు స్వస్తి పలికింది. - అక్షరటుడే, ఎల్లారెడ్డి

# ప్రైవేట్‌కు ధీటుగా ప్రభుత్వ బడి..

- ఆదర్శంగా నిలుస్తున్న కన్కల్ గ్రామం
- రికార్డు స్థాయిలో అడ్మిషన్లు
- ఒక్కతాటిపైకి వచ్చిన గ్రామస్థులు

ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకోవాలని గ్రామస్థులంతా తీర్మానం చేశారు. అందుకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలలో సైతం వసతులు కల్పించేందుకు ఏకమయ్యారు. ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ బడిని తీర్చిదిద్దారు. దీంతో ప్రైవేట్‌కు వెళ్లే విద్యార్థులు అందరూ ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్నారు.

### రూపాయి ఫీజు లేకుండా కార్పొరేట్ చదువు..

‘రూపాయి ఫీజు లేకుండా కార్పొరేట్ స్థాయి చదువు మా ఊరి బడిలోనే అందిస్తాం.. విద్యార్థులను తీర్చిదిద్దేందుకు అనుభవజ్ఞులైన ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉన్నారు’ అంటూ గ్రామస్థులంతా ఏకతాటిపైకి వచ్చారు. ఆ గ్రామ సర్పంచ్ మైలారం రవీందర్ రెడ్డి నేతృత్వంలో గ్రామస్థులు, ఉపాధ్యాయులు కలిసికట్టుగా అడుగులు వేసి తీసుకున్న దృఢ సంకల్పం.. ఆ ఊరి ప్రభుత్వ పాఠశాలను నవశకంలోకి నడిపించింది.

### రాజీ లేకుండా వసతుల కల్పన..

కేవలం మాటలతో సరిపెట్టకుండా, ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా ఈ ప్రభుత్వ పాఠశాలలో వసతులను మెరుగుపర్చారు. కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా సౌకర్యాలు కల్పించడంలో ఎక్కడా కాంప్రమైజ్ అయ్యేదే లేదని సర్పంచ్ మైలారం రవీందర్ రెడ్డి స్పష్టం చేశారు. పాఠశాలలో ఆహ్లాదకరమైన వాతావరణం, నాణ్యమైన విద్యా ప్రమాణాలను కల్పించడంతో తల్లిదండ్రుల్లో నమ్మకం రెట్టింపైంది. ఫలితంగా.. ‘ప్రైవేట్ బళ్ల తళుకుబెళుకులు చూసి మోసపోవద్దు’ అనే పెద్దల మాటను ఊరంతా తప్పక పాటించింది.

### 108 నుండి 253 కి పెరిగిన విద్యార్థులు..

విప్లవాత్మక మార్పుకు నిదర్శనంగా ఈ విద్యాసంవత్సరం కన్కల్ బడి సరికొత్త రికార్డును నమోదు చేసింది. గతంలో ఈ పాఠశాలలో కేవలం 108 మంది విద్యార్థులు మాత్రమే ఉండగా, గ్రామస్థుల సమష్టి కృషితో ఇప్పుడు ఆ సంఖ్య ఏకంగా 253కు చేరింది. ఈ ఒక్క ఏడాదిలోనే ప్రీప్రైమరీ (ఎల్‌కేజీ, యూకేజీ) నుంచి మొదలుకొని పదో తరగతి వరకు ఏకంగా 145 మందికి పైగా విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు గుడ్ బై చెప్పి, కన్కల్ ప్రభుత్వ పాఠశాల వైపు అడుగులు వేశారు. చిన్న పిల్లల తరగతుల నుండి హైస్కూల్ వరకు ఇంత పెద్ద ఎత్తున విద్యార్థులు ఒకేసారి ప్రభుత్వ బడిలో చేరడం మండలంలోనే అరుదైన విషయంగా చెప్పుకోవచ్చు.

### గ్రామమే ఒక కుటుంబంగా మారి..

ఏదేమైనా ప్రైవేట్ పాఠశాలల రంగుల బోర్డులు చూసి పరుగెత్తే ఈ రోజుల్లో.. కన్కల్ గ్రామం సాధించిన విజయం ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని మరింత పెంచింది. ఊరంతా అనుకుంటే సాధించలేనిది ఏదీ లేదు అని నిరూపించిన కన్కల్ గ్రామం ఇప్పుడు అందరికీ ఆదర్శంగా నిలిచింది. ఈ విషయమై అధికారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ బడులకు నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారని కొనియాడుతున్నారు. ఇలా గ్రామస్థులు అందరూ ఏకమై విద్యార్థులను ప్రభుత్వ బడులకు పంపిస్తే నాణ్యమైన విద్య అందుతుందని పేర్కొంటున్నారు.

### సౌకర్యాలు కల్పించడంలో నో కాంప్రమైజ్

ఫీజుల భారంతో నలిగిపోతున్న తల్లిదండ్రులకు మెరుగైన ప్రత్యామ్నాయం చూపించడమే మా లక్ష్యం. ప్రైవేట్ పాఠశాలల కంటే ధీటుగా సౌకర్యాలు మెరుగుపరచడంలో మేము ఎక్కడా రాజీ పడబోం. మా గ్రామం మరిన్ని గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తుంది. గ్రామస్థులంతా కలిసికట్టుగా తీసుకున్న ఈ నిర్ణయం వల్లే ఈ రోజు విద్యార్థుల సంఖ్య 253కు చేరింది. మా నమ్మకాన్ని నిలబెట్టిన ఉపాధ్యాయులకు, నమ్మిన గ్రామస్తులకు ధన్యవాదాలు. కన్కల్ బడిని రాష్ట్రంలోనే ఒక మోడల్ బడిగా తీర్చిదిద్దుతాం.

– మైలారం రవీందర్ రెడ్డి, కన్కల్ సర్పంచ్

### 15 మందితో పర్యవేక్షణ కమిటీ..

పాఠశాల అభివృద్ధి కేవలం అడిషన్లతోనే ఆగిపోకుండా, నిరంతరం నాణ్యమైన విద్య అందేలా చూసేందుకు గ్రామస్తులు సరికొత్త అడుగు వేశారు. బడి నిర్వహణను, ఉపాధ్యాయుల బోధనను, విద్యార్థుల ప్రగతిని నిత్యం పర్యవేక్షించేందుకు 15 మంది సభ్యులతో కూడిన ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ తెలిపారు. ఈ కమిటీ ప్రతిరోజూ పాఠశాల తీరుతెన్నులను పర్యవేక్షిస్తూ, అవసరమైన వసతులను సమకూరుస్తుందని ఆయన పేర్కొన్నారు.



## ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఉర్దూ బోధనపై ఆగ్రహం

**అక్షరటుడే, ఆర్మూర్:** పెర్కిట్‌లోని భరత్ చంద్ర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉర్దూ మీడియం బోధనపై తల్లిదండ్రులు, బీజేపీ నాయకులు శనివారం ఆందోళన నిర్వహించారు. పాఠశాలకు భారీఎత్తున చేరుకొని ఆందోళనచేపట్టారు. తెలుగు, ఇంగ్లిష్ మీడియం అనుమతితో ఏర్పాటు చేసిన పాఠశాలలో విద్యార్థులకు ఉర్దూ నేర్పడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పాఠశాలల్లో పనిచేస్తున్న ఓ వర్గానికి చెందిన ప్రిన్సిపాల్‌తో పాటు మరో ఉపాధ్యాయురాలు విద్యార్థులకు ఉర్దూ నేర్పడంతో పాటు ప్రార్థన చేయించడంపై మండిపడ్డారు. తక్షణమే పాఠశాలను సీజ్ చేసి బాధ్యులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్, ఎస్సై రజనీకాంత్ పాఠశాలకు చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడి శాంతింపజేశారు. కాగా.. పాఠశాల యజమానితో పాటు ఉపాధ్యాయుడిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



## చిన్నారులకు వైద్య పరీక్షలు

**అక్షరటుడే, ముప్కాల్:** ముప్కాల్ మండలం నల్లూరులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం వైద్య బృందం సందర్శించింది. పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించింది. ఈ సందర్భంగా డాక్టర్ మద్దుల రాకేష్ మాట్లాడుతూ పౌష్టికాహార లోపం ఉన్న పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. చిన్నారుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ మురళి, ఆరోగ్య కార్యకర్త పద్మ, అంగన్‌వాడీ పర్యవేక్షకురాలు మాధవి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు సూర్యకళ, సరిత పాల్గొన్నారు.

## ఊర పండుగకు పోలీసు అధికారులకు ఆహ్వానం

**అక్షరటుడే, భీమ్‌గల్:** పట్టణంలో తొమ్మిదేళ్ల సుదీర్ఘ విరామం అనంతరం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'ఊర పండుగ'కు హాజరు కావాలని పోలీసు అధికారులకు సర్వ సమాజ్ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు ఆహ్వానం పలికారు. జులై 12న (ఆదివారం) వేడుకలు జరగనున్న నేపథ్యంలో.. శనివారం భీమ్‌గల్ సీఐ పొన్నం సత్యనారాయణ గౌడ్, ఎస్సై తిరుపతితో పాటు స్టేషన్ సిబ్బందిని కలిసి ప్రత్యేకంగా ఆహ్వానించారు. వేడుకల్లో పాల్గొని గ్రామదేవతల ఆశీస్సులు పొందాలని వారు ఈ సందర్భంగా కోరినట్లు కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బొదిరె నాగమణి స్వామి, వైస్ చైర్‌పర్సన్ సంటి లత జే.జే.నర్సయ్య, సర్వ సమాజ్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పఠాని కృష్ణ, ఉపాధ్యక్షుడు తీగల రఘు, కోశాధికారి ఎస్పీ భూమేశ్వర్, ప్రధాన కార్యదర్శి నిచ్చెమొల్ల రాజేశ్వర్ పాల్గొన్నారు. అలాగే ఒకటో వార్డు కౌన్సిలర్ ఆరేపల్లి శ్రీజ నాగేంద్రబాబు, కౌన్సిలర్లు పర్స కుశలత అనంతరావు, తోట సతీష్, బొదిరె నరసయ్య, నీలం రవి, మలావత్ సంగ్యా నాయక్, మామరి సందీప్, మల్లెల అనుపమ ప్రసాద్, సర్వ సమాజ్ సలహా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**అక్షరటుడే, భీమ్‌గల్ :** మండలంలోని మెండోరా గ్రామంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన ఆర్థిక సాయం చెక్కులను శనివారం లబ్ధిదారులకు అందజేశారు. సర్పంచ్ కుంట లక్ష్మీరమేశ్ చేతుల మీదుగా లబ్ధిదారులు కుంట అరవింద్, వడ్డే గుర్రపు ఎల్లయ్యలకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న సమయంలో ప్రభుత్వ సాయం ఊరటనిచ్చిందని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి, బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ రెడ్డికి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు రాజేశ్వర్ గౌడ్, నాయకులు పల్లె శేఖర్, సాకలి గంగాధర్, మెడికల్ సత్యం, బ్రిస్టల్ భూమన్న, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ‘గోపా’ కామారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా లింగాల రాజబాబు గౌడ్



**అక్షరటుడే, భిక్కనూరు:** గౌడ్స్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) కామారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా భిక్కనూరుకు చెందిన లింగాల రాజబాబు గౌడ్ ఎన్నికయ్యారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన గోపా జిల్లా సర్వసభ్య సమావేశంలో నూతన జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా లింగాల రాజబాబు గౌడ్ మాట్లాడుతూ.. ‘గోపా’ వేదికగా గౌడ సమాజ అభ్యున్నతికి, నిరుపేద గౌడ విద్యార్థుల విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. సమాజ సంక్షేమం కోసం సంఘం ఆధ్వర్యంలో ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని, కామారెడ్డి జిల్లాలో 5,000 సభ్యత్వాల నమోదు లక్ష్యంగా పనిచేస్తామని పేర్కొన్నారు. జిల్లాలోని గౌడ ఉద్యోగులు, అధికారులు, వివిధ రంగాల ప్రొఫెషనల్స్‌ను ఒకే వేదికపైకి తీసుకువచ్చి సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి జిల్లా ప్రధాన కార్యదర్శి బాధ్యతలను అప్పగించిన ‘గోపా’ రాష్ట్ర కమిటీ, జిల్లా నాయకత్వానికి రాజబాబు గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

## దళిత, గిరిజన జర్నలిస్టుల ఆత్మగౌరవమే లక్ష్యంగా పనిచేస్తాం

**అక్షరటుడే, కోటగిరి :** తెలంగాణ రాష్ట్రంలోని దళిత, గిరిజన జర్నలిస్టుల ఆత్మగౌరవమే తమ లక్ష్యమని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాదేపురం గంగన్న పేర్కొన్నారు. మండల కేంద్రంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. దళిత, గిరిజన జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డుల మంజూరులో జరుగుతున్న సామాజిక వివక్షను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని కాదేపురం గంగన్న అన్నారు. అక్రెడిటేషన్ కమిటీల్లో ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 29న హైదరాబాద్‌లోని ఐ అండ్ పీఆర్ కమిషనర్ కార్యాలయ ముట్టడి కార్యక్రమం ఉందన్నారు. ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో చదువుకుంటున్న దళిత, గిరిజన జర్నలిస్టుల పిల్లలకు నూరుశాతం రాయితీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ముట్టడికి దళిత, గిరిజన జర్నలిస్టులు, దళిత, గిరిజన సంఘాలు, ప్రజాసంఘాలు, సామాజిక న్యాయవాదులు తమ మద్దతును ప్రకటించి పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో దళిత జర్నలిస్టులు బేగరి రాములు, పుప్పాల సైదయ్య, రాము, జీవన్, యాదవ రావు, భీంరావు, అర్జున్ పాల్గొన్నారు.









## గుంతల రోడ్డుపై ప్రయాణం నరకం..

నగర శివారులోని వర్ని రోడ్ నుంచి నాగారం వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. నిత్యం వేల సంఖ్యలో వాహనాలు తిరిగే ఈ రోడ్డుపై అడుగడుగునా గుంతలు దర్శనమిస్తున్నాయి. దీంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఆర్టీఏ కార్యాలయానిక వెళ్లే దారి కూడా ఇదే కావడం గమనార్హం. వెంటనే ఈ దారిపై గుంతలను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

– అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్